గోడవతల పకపకనవ్వు! అద్దాల తలుపులలోంచి కూడా కహకహ నవ్వు! ఆశ్చర్య గంభీరమైన జనార్దనశర్మ ముఖంలో ఒక చేమ చిరునవ్వు!

స్వర్ణయోగం

ఎప్పుడేనా ఊహించావు? ముసలి రావిచెట్లూ—పాత పెంకుటిళ్ళూ—చెరిగిపోయిన జ్ఞాపకాల్లా వింత వింత కథలు చెబుతాయి—

ఎన్నో సంవత్సరాల అనుభవాలలోనుంచి నాగరికతలోనుంచి ఎంత ఎత్తుగా ఎదిగినా—అదుగో ఆకూలిపోయే ప్రహారీల నడుమ, కులుకుతూ పరధ్యానంగా ఉన్న నూజమీందారు గారి పెరట్లోని ముసలి పెంకుటింటి, ప్రక్కగానే నడుస్తూ ఉంటే యీకథ జ్ఞాపకం రాకుండా ఉండదు.

ఇలాచూడు—ఇప్పుడు ఉప్పుదుల్లిపోయిన జమీందారు గారి మేడగోడల్నీ—సున్నంలేక పొగరంగు తేలిన అంతఃపురాలను— ఎండిన దిగుడు బావుల్నీ, పగిలిన నగిషీలను (కొంచెం వెనక్కి జరిగి) రంగులతో, రక్తితో—భక్తిచేసుకో గలిగితే అదీ నాకథాకాలం—

హఠాత్తుగా కనకపు సింహాసనంమీద పడ్డ అదృష్టవంతుల్లో గోవిందబాబుగారిని ముందు చెప్పి—ఇంకొకరిని చెప్పాలి.

ఆయన కడుపు చలవ దొడ్డది. ఎనమండుగురు పురుషసంతానం, ఏడుగురు బంగారపు బొమ్మలు ఆడపిల్లలు. శ్రీ బాబుగారికి సీమకుక్కలంటే వల్లమాలిన ప్రేమ. సుమారు పాతిక వేల రూకలు వెచ్చించి నాణ్యమైన పరాసుకుక్క కుటుంబాలను కొని వినోదంగా పోషించేవారు. చిరంజీవులు చిన్నబాబులికి నీచమైన శునకపోషణం ఏహ్యంగా తోచి శుభ్రమైనఆడపిల్లల్ని తలో యిద్దర్ని పోషించేవారు.

గోవిందబాబుగారు ధర్మరాజు. ఎవరికెంత డబ్బు కావలిస్తే అంతా ఖజానాలోంచీ, భూములమీద నుంచి తెచ్చి, వాడుకోడమే, కాని, ఎవరినీ ఎప్పుడూ, 'దేనికెంత' అని అడిగిన పాపాన్ని పోలేదు. కొన్నాళ్ళకు ఖజానా అడిగినంతా యివ్వ లేక మూలిగింది. చాలా భూములు అశోకవనంలో సీతలా అన్యాక్రాంతా లయాయి. శ్రీవారికి ఉభయులమీద పట్టరా నంత కోపం వచ్చింది. చిన్నబాబులు శాంతమూర్తులు "ఆసూర్యం పశ్యులు".

ఒకనాడు శ్రీబాబుగారు మధ్యాహ్న ఫలహారంచేసి శుభ్ర మైన లంకాకు చుట్టవెలిగించి, పొగపీల్చుతూ వదలుతూ మేడ మీదసోఫాలోకూచుని ఒక సీమకుక్కనులాలించుతూండగా— చనువైన నౌకరు వెంకటస్వామి వచ్చి జమీందారుగారి పాదాల దగ్గిర కుక్కను నిమురుతూ కూర్చుని యేదో చెప్ప దలచుకున్నవాడిలా కనిపించాడు. బాబుగారది గ్రహించి అన్నారు 'ఒరే స్వామి గ్రామంలో విశేషాలేమిట్రా' అని.

వెంకటస్వామి కొంచెం దగ్గి చేతులు నలుపుతూ ‘చిత్రం చిత్రం వూళ్ళోకి మహా గొప్ప ఓగిబికరు యిజయం చేసారండి. ఊరి వెలపల గంగరావిచెట్ల దగ్గర పెద్దనెగడి ఎలిగించి, మంచి తీర్తమయినా బోంచెయ్యక బగమంతుడు సూర్యనారాయణ మూరితికేసి సూస్తూ పద్దినాలనుంచి ఏకటాకీని ఉన్నారంట బాబయ్యా, నిన్నట్నుంచి చుట్టుపట్ల ప్రజ రాణువులుగానచ్చి పళ్లూ, పలాలతో దరిశనం చేస్తున్నారు. ఆ మాగానుబావుడు ఒక్కర్ని కన్నెత్తి చూడడు. ఆడంగులంటే ఆమడ దూరంలో ఉండాలంట. ఏం మహాత్తెం ప్రెబూ! ఉదయంకన్ను తెరసి సిరు నవ్వనవ్వి, పడిగాపులడివున్న జనాన్ని సూసి ఎర్రిమానవులు—అని పెదిమి ఇరిసి పాయిబుగ్గి, మంతిరించి యిసిరేసరికి అన్ని రూపాయిలంట బాబయ్యా! దాంతో, మూరుకుల కేంటి బాబయ్యా—రూపాయిలకోసం తోపులాట జరిగేసరికి విసిగెత్తి ఓగీశ్వరులు సిటికేసి మాయమై పోయారండి—

మద్దానం...ఓగంట కితం మన పెద్దమామిడి తోపులో దివాణం కోసం కాయలు కోస్తుండగా ఆమహారాజు ఒక సువర్ణరేక చెట్టుకింద మటం వేసుకొని ముక్కుమూసుకొని జపంసేసుకొంటూ నన్ను కను సౌంగ్గతో పిలిసి “ఏమిరా ఈ ఊళ్లో పొర్ణం సేయించే ప్రెబు వెవరయినా ఉన్నారా—ఉంటే సేసిస్తాం, ఒక్కరోజు కంటె ఇక్కడ వుండం ఒక్కమునుగు దాకా ఈగ్రామానికి యివ్వదలిశాము. అని వెంటనే సమాధిలోకి ఎలి పోయారు. బాబయ్యా, మాగనమైన ఓగి...” అని

వెంకటస్వామి అంగన్యాస కరన్యాసాలతో విన్నవించేసరికి, గోవిందబాబుగారికి పట్టరాని ఆశ్చర్యం కలిగింది. నిండుకొనే ఖజానా మాట, మణుగు బంగారంమాట రెండూ జోడించి తలుచుకొంటె తనకోసమే భగవంతుడు ఈయోగిని యిక్కడికి పంపాడని నిశ్చయమయింది. లేకపోతే ఊరంతా వదిలి తన మానిడితోట ననుగ్రహించడం తన నౌకరుతో చెప్పడం ఎందుకూ? అన్నిటికంటే ముఖ్యం సువర్ణరేఖ చెట్టుక్రింద కూర్చోవడం.

వెంటనే జమీందారుగారు లేచి నించుంటూనే జోడులో కాలుంచుతూ, స్వామీ, లే, వెంటనే యోగీశ్వరుల దర్శనం చేద్దాం అంటూ చరచరా మేడమెట్లు దిగారు.

2

జమీందారుగారి భవనపు వెనకవైపున ప్రత్యేకంగా వుండే పెంకుటిల్లు జనప్రవాహంతో నిండిపోయింది. ఉదయంనుంచీ కని పెట్టుకున్నా యోగిదర్శనం కావడంలేదు.

గ్రహ బాధలవాళ్ళూ, పిల్లలు కోరేవాళ్ళూ, పురాణ వ్యాధులవాళ్లూ, తరుణోపాయపరులు, ఏదోసమయం చూచి యోగినిదర్శించి వెడుతున్నారు. స్త్రీలు రావడానికి వీలులేదు. కనుక భర్తలే సంతాన విభూతి రాయించుకు వెడుతున్నారు. గోవిందబాబుగారు తమభవనంలోనే దయచేసి ఉండమంటే

యోగీశ్వరులు స్త్రీదృష్టిని పరిగ్రహించడానికి దూరంగా యీ యింట్లో వుంటామన్నారు.

వచ్చి పదిరోజులయింది. భక్తులు, మోక్షార్థులు, ఆర్తులు, ఎక్కువ అవుతున్నారు నానాటికి—వచ్చిన వారందరికీ భోజనాదికం ఏర్పరచమని యోగి ఆజ్ఞ. జమీందారుగారికి దగ్గరగా ఒక వెయ్యి కర్చుఅయినా యోగీశ్వరసేవ వ్యర్థంకాదని గోవిందబాబుగారు ఘట్టినమ్మకంతో ఉన్నారు.

అష్టదళపద్మం మీద వ్యాఘ్రచర్మం పరచి వీరాసనం మీద మౌనంగా కూర్చునే, వారిని దర్శిస్తేచాలు, సర్వపాప వినాశనం అవుతుంది. బలిష్ఠమై కండలు తేరిన పచ్చని సోగ శరీరం. కనుబొమ్మలమధ్య అర్థచంద్రాకారంగా కుంకంబొట్టు నల్లనిజడలు గడ్డమూలోంచి, పటిష్ఠమైన యౌవన ధృఢిమ కనబడుతోంది. ఆయన, రోజు మొత్తంమీద ఒకటి రెండుసార్లు మాత్రం జమీందారుగారితో మాటలాడడం కద్దు. తక్కిన వన్నీ కనుసంజ్ఞలతో యిష్టభృత్యుడైన వెంకటస్వామితో సూచిస్తారు. స్వామి పరుగులమీద యోగివారి సూచనలు అమలు జరిపి వారిదృష్టి పడేచోట మళ్లీ ఒదిగి కూర్చుంటాడు.

3

ఆరోజున స్వర్ణయోగ సాధనం చేస్తామని యోగిగారు వెంకటస్వామిద్వారా ప్రకటించారు. పరగ్రామాలనుంచి వచ్చే జనప్రవాహాన్ని టక్కున ఆపుచేశారు. యోగీశ్వరులు పూర్తిగా

ఆవేళ నిరాహారం, ఆయన కామదహనంచేసిన రుద్రమూర్తిలా ఆరోజున దుర్నిరీక్ష్యంగా ఉన్నారు. ఒక గదిలో పెద్ద హోమ గుండం తవ్వారు. చుట్టూ తొమ్మిదిరంగుల ముగ్గులుపెట్టారు. ఎదురుగా భయంకరమైన కాళీమూర్తి, ఆంజనేయ విగ్రహం, పట్టుగా చిత్రించారు. వాటికి రెండువైపులా రెండు అఖండ జ్యోతులు తీక్ష్ణంగా వెలుగుతున్నాయి.

64 రకాల పత్రి, 72 రకాల పువ్వులు 116 రకాల ఫలము లతో పూజ దివ్యంగా తెల్లవారుజాము మొదలు జరుగుతోంది. ఒక్కయోగిగారు మాత్రమే దీక్షలోఉండి సాయంకాలానికి పూజాహోమవిధులు పూర్తిచేసి జమీందారుగారికి కబురు చేశారు. "నాపూజాదీక్ష ముగిసింది. శ్రీవారు జనానాతోకూడా వచ్చి తుది రోజుగనుక దర్శనంచేసి వెళ్ళవచ్చును."

గోవిందబాబుగారు భార్య కూతుళ్లతో పట్టుబట్టలు కట్టు కొని భయభక్తులతో వచ్చి యోగి ఎదుట వారి ఆశీస్సులు కోరి నిలుచున్నారు. యోగిపద్మాసనం మీద ఊర్ధ్వకాయం ఋజ్వాయతంచేసి కన్నులు మూసుకొని ఉండి అభయహస్తం పట్టి 'ఇష్టస్వర్ణసిద్ధిరస్తు' అని పలికి, స్త్రీలను దూరంగా వెళ్ళ మని సంజ్ఞచేసి కళ్ళుతెరచి 'రాజా, అదృష్టవంతుడవయ్యా నీ కోరిక ఇకగంటలో తీరుతుంది.' అని స్వగతంలాంటిప్రకాశంగా చెప్పికాని ఒకగట్టి పరీక్షమాత్రం ఉంది. —కాళీమాయ ఉందిలే మన పాలిట... దానితోసిద్ధి. ఇదిగో పులినాలిక, తేడి కన్నా, కుందేటిచెవి, చిలకరెక్క వెయ్యినూట ఒక్కపసర్లతో

మర్దించి ఈఘటంనింపి దీన్ని మంత్రం పూతంచేసి ఈ హోమ గుండంమీద పెడుతున్నాను. అయితే ఒక గట్టిచిక్కుమాత్రం ఉంది.

రాత్రిసరిగ్గా ఒంటిగంటకు ఈపసర్లు పక్వమయ్యే సమయానికి ఒక కన్యక పురుష స్పర్శ ఎంతమాత్రం ఎరగనిది కుడి బాహుమూలంలో తిల సదృశమైన పుట్టుమచ్చ కలది సర్వాభరణ భూషితురాలై నిర్భయంగా వచ్చి ఈమూలికను ఈ భాండంలో వేస్తే, రాజా! తెల్లవారు జాముకు ఈఘటం, లోని పదార్థంతో సహా యావత్తూ సువర్ణమయం అయిపోతుంది. ఆమెకు ఎట్టిపరిజనమూ ఉండకూడదు. భగవతికాళీమాయయే ఆమెను వెన్నాడి రక్షిస్తుంది. అస్మదాదుల వంటివారు కూడా ఇక్కడ ఉండరాదు ఆమెలో కాళీమాయి ఆవహించిఉంటుంది. ఎదుట పడితిమా తల పగిలిపోతుంది ఆసమయానికి మేమెక్కడో సమాధిలోవుంటాము. తీరిపోతుంది. ముందువిషయం ఆలోచించు" అని మౌనముద్రవహించాడు. గోవిందబాబు గారికి పచ్చివెలగ, గొంతు బడినట్లైంది. 'చిత్తం' అనిబరువుగా అని రాణివాసంతో కూడ వెళ్ళిపోయారు.

4

ఇంకా సూర్యోదయం కాలేదు. తూర్పున తెలిరేకలు అప్పుడే విడుతున్నాయి. జమీందారుగారు సువర్ణభాండం గురించి సుందరస్వప్నం ఒకటి కంటున్నారు—ఒకదివ్య సుందరవిగ్రహం

అచ్చంగా తన మూడవకుమార్తెను పోలింది ధగధగ మెరిసే బంగారు కుండను చేతితో పట్టుకొని అందించబోతున్నది. చేయి జాస్తే పకపక నవ్వి ఇంకోవైపు తిరిగిపోయింది. నాకేనా కే అంటూ శ్రీబాబుగారు రెండుచేతులూ చాపగా అంతర్ధానం అయిపోయింది.

చట్టునకళ్ళు తెరచి చూడగా నౌఖరుఒకడు బాబూబాబూ అని ఆందోళనగా తనను లేపుతున్నాడు భవనం అంతా అల్లకల్లోలంగావుంది. పెద్దపెద్ద కేకలు—తిట్లు—వెర్రిపరుగులు—తో భవనమంతా నిండిపోయింది. నిద్రకళ్లను చెవులను బాగా విప్పి వినగా నౌకరు మొర్రపెడుతున్నాడు. "బాబూ, మోసం ద్రోహం, హోమగుండం గదిలో ఎవ్వరూ లేరు. ఐదు వేల జవాహరితో చంద్రావతమ్మగారు ఐపులేరు. అమ్మగారికి మతి పోయింది"! అని గోలపెట్టాడు. జమీందారుగారు ఒక్కతూలు తూలి "అయితే స్వర్ణయోగం నాకా ఆబైరాగినుండా కొడుకా? బంగారపుబొమ్మ లాంటిపిల్ల ఒంటినిండా బంగారం వెంకటస్వామిని తక్షణంపిలు" అనిముందుకు దూకారు. నిన్న సాయంత్రంనుంచీ స్వామి 'పతా' లేదు బాబయ్యా" అన్నాడు నౌకరు ముఖం తేలవేస్తూ—